# సమగ్ర కుటుంబ సర్వే పూర్తి వివరాలు

**ప్రజాపక్షం /హైదరాబాద్** : సమగ్ర కుటుంబ సర్వే పూర్తి వివరాలను తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. సీపెక్ సర్వే పూర్తి వివరాలు పబ్లిక్ డొమైన్‌లో పెడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. సీపెక్ సర్వేపై నిపుణుల నివేదికనూ బహిరంగపరుస్తున్నట్లు తెలిపారు. సీపెక్ సర్వే వల్లే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అసెంబ్లీలో చర్చించి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని, తెలంగాణ కులగణనను దేశవ్యాప్తంగా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

**బిసిలలో అత్యధిక జనాభా కలిగిన టాప్ 20 కులాలు**

1. ముదిరాజ్ (Mudiraj) – 26,39,027 (7.4%)
2. యాదవ / గొల్ల (Yadava/Golla) – 20,18,725 (5.7%)
3. గౌడ్ (Goud) – 16,30,187 (4.6%)
4. మున్నూరు కాపు (Munnurukapu) – 13,75,018 (3.9%)
5. పద్మశాలి (Padmasali) – 11,82,252 (3.3%)
6. రజక (Rajaka) – 9,95,972 (2.8%)
7. కురుమ / కురుబ (Kuruma/Kuruba) – 7,95,822 (2.2%)
8. ఒడ్డె / వడ్డెర (Odde/Vaddera) – 6,43,571 (1.8%)
9. అగ్నికుల క్షత్రియ (Agnikulakshatriya) – 5,27,119 (1.5%)
10. నాయి బ్రాహ్మణ్ (Nayi Brahmin) – 4,33,785 (1.2%)
11. కుమ్మర (Kummara) – 4,31,363 (1.2%)
12. వడ్రంగి (Vadrangi) – 4,07,927 (1.1%)
13. వాల్మీకి / బోయ (Valmiki/Boya) – 3,59,230 (1.0%)
14. దుదేకుల (Dudekula) – 2,69,699 (0.8%)
15. పెరిక (Perika) – 2,30,851 (0.6%)
16. బ్లాక్‌స్మిత్ (Blacksmith) – 1,65,726 (0.5%)
17. మేదరి (Medari) – 77,645 (0.2%)
18. గంగి రెద్దుల వారు (Gangiredlavaru) – 92,430 (0.3%)
19. గోల్డ్‌స్మిత్ (Goldsmith) – 2,48,965 (0.7%)
20. ఉప్పర (Uppara) – 1,24,148 (0.3%)

**OC (General Category) కులాలలో అత్యధిక జనాభా కలిగిన టాప్ 10 కులాలు**

1. రెడ్డి (Reddy) – 17,10,244 (4.8%)
2. ముస్లింలు (OC Muslims) – 6,32,782 (1.8%)
3. కొమటి / వైశ్య (Komati/Vaishya) – 5,08,813 (1.4%)
4. కమ్మ (Kamma) – 3,67,715 (1.0%)
5. బ్రాహ్మణులు (Brahmins) – 3,35,806 (0.9%)
6. కాపు / నాయుడు (Kapu/Naidu) – 2,42,321 (0.7%)
7. వెలమ (Velama) – 1,43,523 (0.4%)
8. రాజు (Raju/Kshatriya) – 60,471 (0.2%)
9. అయ్యంగార్ / అయ్యర్ (Iyengar/Iyer) – 52,724 (0.1%)
10. జైనులు (Jains) – 51,623 (0.1%)

**ఎస్‌సి కులాలలో అత్యధిక జనాభా కలిగిన టాప్ 10 కులాలు**

1. మాదిగ (Madiga) – 36,57,551 (10.3%)
2. మాల (Mala) – 14,71,514 (4.1%)
3. బెడ బుడగ జంగాలు (Beda/Budga Jangam) – 1,90,120 (0.5%)
4. మాల సాలే (Mala Sale) – 1,70,254 (0.5%)
5. మహార్ (Mahar) – 58,822 (0.2%)
6. మాదాసి (Madasi Kuruva) – 53,367 (0.2%)
7. మాల దాసరి (Mala ్రasari) – 47,690 (0.1%)
8. మాల దాసు (Mala ్రasu) – 18,076 (0.1%)
9. మంగ (Mang) – 18,830 (0.1%)
10. జాంబువులు (Jambuvulu) – 19,526 (0.1%)

**ఎస్‌టి కులాలలో అత్యధిక జనాభా కలిగిన టాప్ 10 కులాలు ఇవి**

1. లంబాడీ / సుగాలి (Lambadis/Banjara) – 24,04,056 (6.8%)
2. కొయ (Koya) – 4,28,142 (1.2%)
3. గోండ (Gond) – 3,81,895 (1.1%)
4. ఎరుకుల (Yerukula) – 1,84,721 (0.5%)
5. కొలం (Kolam) – 83,832 (0.2%)
6. చెంచు (Chenchu) – 35,683 (0.1%)
7. ఆంధ్ (Andh) – 37,900 (0.1%)
8. నాయక్ (Nayaks) – 16,510 (0.05%)
9. నక్కల (Nakkala) – 12,519 (0.04%)
10. పర్ధాన్ (Pardhan) – 27,165 (0.1%)

# ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తం

## వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స : అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులకు సూచించారు. వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్, పరిసర ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. వడ దెబ్బతో అనారోగ్యం పాలైన వారికి చికిత్స అందించేందుకు ఒక బృందాన్ని 'హాస్పిటల్ ఎమర్జన్సీ' ఏరియాలో సిద్ధంగా ఉంచాలన్నారు. 'ప్రభుత్వ దవాఖాన్లలో తాగు నీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు, జనరేటర్లు , అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు , వడ దెబ్బ బాధితులకు చికిత్స తదితర అంశాల'పైన ఉన్నతాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని 'రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్' కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టిజిఎంఎస్ఐడిసి ఎండి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎండా కాలం నేపథ్యంలో వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలను, హాస్పిటళ్లలో అవుట్ పేషెంట్, ఇన్‌పేషంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. వడ దెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, అవసరమైన మెడిసిన్, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూపెద్ద హాస్పిటల్స్‌లోని ప్రతి బ్లాక్,ఫ్లోర్‌లో తాగు నీటిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్ ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ఉక్కపోత సమస్య ఎక్కువగా అవుతుందని, ఈ నేపథ్యంలో అవుట్ పేషెంట్లకు, ఇన్‌పేషంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసియు, అవసరమైన ఇతర వార్డుల్లో ఎసిలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్శించేలా పనులు

## పర్యాటక ప్రాంతాలను పరిశీలించిన మంత్రి జూపల్లి - పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** రాష్ట్రంలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద ,ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. వీటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. ఆదిశగా పనులు చేపట్టామని చెప్పారు.హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక స్థలాలను ఆయన బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్శించేలా చేయటంతో పాటు మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. సెవెన్‌టూంబ్స్ కటోరా హౌజ్, కెబి మ్యూజియం, గోల్కొండ కోట తదితర ప్రాంతాలలో జరుగుతున్న పనులను పరిశీలించి వాటిని వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుతుబ్‌షాహి టూంబ్స్‌లోని ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పాటు వక్ఫ్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న కేసు పనుల గూర్చి చర్చించారు. ట్రిబ్యునల్‌లో పరిధిలో ఉన్న పనులను మినహాయించి మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలన్నారు. కుతుబ్‌షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3కిలోమీటర్ల మేర చేపట్టనున్న రోప్‌వే నిర్మాణానికి సంబంధించిన పనుల ప్రతిపాదనలు ఏస్థాయిలో ఉన్నాయోనని ఆరాతీయగా అవి క్లియరెన్స్ దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. కుతుబ్‌షాహి డెవలప్‌మెంట్ అథారిటీతో సమన్వయం చేసుకుని వెంటనే డిపిఆర్ సిద్ధం చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. కటోరా హౌజ్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కటోరా హౌజ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని జిహెచ్ఎంసి అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గోల్కొండ సమీపంలోని బస్‌స్టాప్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖజానా బిల్డింగ్ మ్యూజియంను పరిశీలించారు. కెబి మ్యూజియం వెనుక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీసుల సహకారంతో తొలగించాలన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్, టిజిటిడిసి ఎండి గౌతమి, పురావస్తు శాఖ డెరెక్టర్ అర్జున రావు, ఇతర శాఖల ఆధికారులు పాల్గొన్నారు.

# బిహార్ సిఎంగా సమ్రాట్ చౌదరి ప్రమాణస్వీకారం

## జెడియుకు చెందిన బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి మంత్రులుగా ప్రమాణం




**పాట్నా :** బిహార్ 24వ ముఖ్యమంత్రిగా బిజెపి నాయకుడు సమ్రాట్ చౌదరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో కాషాయ పార్టీకి చెందిన ఒక సభ్యుడు అత్యున్నత పదవిని అధిరోహించడం ఇదే తొలిసారి. బుధవారం లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ సమ్రాట్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో ముఖ్యమంత్రి పదవిని త్యజించిన జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్, కేంద్ర మంత్రి, మాజీ బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, అలాగే బిహార్‌లో అధికార ఎన్‌డిఎ కూటమిలో మూడవ అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన ఎల్‌జెపి (ఆర్‌వి) అధినేత చిరాగ్ పాశ్వాన్ ఉన్నారు. ఈ సందర్భంగా జెడియుకు చెందిన బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరి కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సమ్రాట్ చౌదరీకి అభినందనలు తెలిపారు. ఆయనలోని ఉత్సాహం, ప్రజా సేవ పట్ల అంకితభావం, క్షేత్రస్థాయి అనుభవం రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. జెడియుకు చెందిన ఇద్దరు నాయకులను ఉప ముఖ్యమంత్రులుగా నియమించే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ, సమ్రాట్ చౌదరీ, మరో బిజెపి నాయకుడు విజయ్ కుమార్ సిన్హా తన ఉప ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటి అధికార సమీకరణాలు ఇప్పుడు తలక్రిందులైనట్లుగా ఈ పరిణామం కనిపిస్తోంది. 75 ఏళ్ల నితీష్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికవడంతో రాష్ట్రంలో ఈ నాయకత్వ మార్పు అనివార్యమైంది. సమ్రాట్ చౌదరీ రాజకీయాల్లోకి వచ్చి దాదాపు మూడు దశాబ్దాలు గడిచినా, 57 ఏళ్ల ఈ నాయకుడు బిజెపిలో చేరింది మాత్రం కేవలం తొమ్మిదేళ్ల క్రితమే. 'నేను ఈ రోజు నుంచే నా పనిని ప్రారంభిస్తాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రూపొందించిన పాలనా నమూనానే బిహార్‌లోనూ అనుసరిస్తామని ప్రజలు నిశ్చింతగా ఉండవచ్చు' అని ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం సమ్రాట్ చౌదరీ విలేకరులతో అన్నారు. ఆయనకు కాబోయే ఇద్దరు డిప్యూటీలు 1980వ దశకంలో తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. వారి అనుభవం, సామర్థ్యం, రాజకీయ నిబద్ధత కారణంగా నితీష్ కుమార్ వారిపై నమ్మకం ఉంచారు. వారు నితీష్ కుమార్ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులను నిర్వహించారు. అంతేకాకుండా, విజయ్ కుమార్ చౌదరి 20152020 మధ్య అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం, ముఖ్యమంత్రి సచివాలయానికి వెళ్లి, అక్కడ ప్రభుత్వ అధికారులతో సమావేశమై, తన పరిపాలన ప్రాధాన్యతల గురించి వారికి వివరించారు. తరువాత, చౌదరి బిజెపి కార్యాలయాన్ని కూడా సందర్శించగా, పార్టీ కార్యకర్తలు ఆయనను సన్మానించారు.

# జీవన్‌రెడ్డి ఈ స్థాయిలో ఉండడానికి కాంగ్రెస్ బిక్షే కారణం : బల్మూరి వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ పెట్టిన రాజకీయ బిక్ష కారణంగానే ఈ స్థాయికి చేరుకున్న టి.జీవన్ రెడ్డి ఆది మరిచిపోయి కాంగ్రెస్ పార్టీపై ప్రభుత్వంపై నోటీకొచ్చినట్లు మాట్లాడడం హస్యాస్పదమని ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ అన్నారు. బుధవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గా మారిందన్న జీవన్ రెడ్డి కల్వకుంట్ల ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో చేరుతున్న విషయాన్ని మరిచిపోయినట్లున్నారని పేర్కొన్నారు. ఆ కంపెనీలో కె.చంద్రశేఖరరావు, కె.తారక రామారావులు తప్ప మరొకరు ఉండరన్న సంగతి జీవన్ రెడ్డి కి తెలియదా అన్ని ప్రశ్నించారు. కన్న కూతురును కూడా బయటికి పంపించిన విషయం జీవన్‌రెడ్డికి అర్థం కాలేదా అన్నారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కోసం ఎవరైనా కెసిఆర్‌తో చేతులు కలుపుతారా అన్ని ప్రశ్నించారు.జీవన్ రెడ్డి బిఆర్‌ఎస్‌లో చేరడంతోనే ఆయన రాజకీయ చరిత్ర భూస్థాపితమైందని, జగిత్యాల ప్రజలు కూడా జీవన్ రెడ్డి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు.

# పరిశ్రమ, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకే నూతన సిలబస్

## 'యుకె విశ్వవిద్యాలయ' ప్రతినిధులతో ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరిశ్రమవిద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు నూతనగా వినూత్న సిలబస్, నైపుణ్యాధారిత అండర్,పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రవేశపెట్టినట్టు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టిజిసిహెచ్ఇ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని తెలిపారు. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టిజిసిహెచ్ఇ) చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ బృందంలో ప్రొఫెసర్ స్టీవర్ట్ రాబిన్సన్ (డీన్, ఆపరేషనల్ రీసెర్చ్), డాక్టర్ ఆదిత్య నారాయణ్ శర్మ (గ్లోబల్ స్పెషల్ అడ్వైజర్ ఆఫ్ ఇండియా), బ్యారీ హోడ్జ్సన్స్ (డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డేటా), సంజనా మెడిపల్లి (హెడ్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ పాట్నర్‌షిప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధస్సు (ఎఐ ), డేటా సైన్స్, ఆవిష్కరణ, వ్యాపార ప్రారంభాలు , సస్టైనబుల్,రెసిలియంట్ నగరాలు, అనుబంధ ఆరోగ్య కార్యక్రమాలు, అగ్రో బిజినెస్,మేనేజ్‌మెంట్ రంగాల్లో పరస్పర సహకారం తదితర అవకాశాలపై వారు చర్చించారు. సింగపూర్, మలేషియా దేశాల్లో తమ ఆఫ్‌క్యాంపస్ కేంద్రాలు ఉన్నాయని, భారత దేశంలో కూడా ఆఫ్‌క్యాంపస్ కేంద్రాల స్థాపన కోసం పలు నగరాలను పరిశీలిస్తున్నామని న్యూకాసిల్ యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలను వివరించారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే యువ రాష్ట్రంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని, రక్షణ తయారీ, ఔషధ పరిశ్రమలు, ఐటీ రంగాల్లో ప్రపంచ స్థాయిలో ఎదుగుతున్నదని వివరించారు. విద్యార్థులకు తక్షణ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టామని, అకాడమిక్ భాగస్వామ్యాలు, స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ హబ్‌లు, డిజిటల్ ఇనిషియేటివుల, ఎఐ ఆధారిత ట్యూటర్లు, కోడింగ్ సపోర్ట్ వంటి పలు సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని బాలకిష్టా రెడ్డి వివరించారు.

# అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

## అడిషనల్ డిజిపి మహేష్ భగవత్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాంతకమవుతుందని శాంతిభద్రతల విభాగం అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం డిజిపి కార్యాలయంలో అగ్నిమాపక శాఖ అధికారులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు పడకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించడం ద్వారా ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఆయన సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే 101 నంబరుకు సమాచారం అందిస్తూనే, మంటలు చెలరేగగానే భవనాన్ని తక్షణమే ఖాళీ చేయాలని, కిందికి రావడానికి లిఫ్టులు వాడకుండా కేవలం మెట్ల మార్గాన్నే ఎంచుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ భవనంలో పొగ ఎక్కువగా వ్యాపిస్తే ఊపిరాడకపోయే ప్రమాదం ఉన్నందున నేల మీద పాకుతూ వెళ్లడం శ్రేయస్కరమని, ముక్కుకు తడిగుడ్డ కట్టుకుని సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలని వివరించారు. ఒంటికి మంటలు అంటుకుంటే పరిగెత్తకుండా వెంటనే నేలపై పడుకుని దొర్లడం ద్వారా మంటలను అదుపు చేయవచ్చని, అలాగే పాఠశాలలు, ఆసుపత్రులు, బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని భద్రతపై ప్రతి పౌరుడూ కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు. ముఖ్యంగా వంట గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు గానీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయినప్పుడు గానీ ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్గిమాపక శాఖ అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పి అండ్ ఎల్ ఐజిపి గజరావు భూపాల్, ఆర్ఎఫ్ఓ హరిచంద్రారెడ్డి, డిఎఫ్ఓ వెంకన్న పాల్గొన్నారు.

# ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## ఐఎన్‌టియుసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల సమ్మె నిర్ణయంపై తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, ఆర్ డి. చంద్రశేఖర్‌లు ఆర్‌టిసి కి సంబంధించిన ఐఎన్‌టియుసి నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,ఆర్‌టిసి జెఎసి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు కార్మికులలో ఉన్న అసంతృప్తిని తొలగించి, పారిశ్రామిక శాంతిని నెలకొల్పాలన్నారు. ముఖ్యంగా ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి, అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించడంతో పాటు ఆర్‌టిసిలోని కార్మిక సంఘాలను పునరుద్ధరించి, యూనియన్ ఎన్నికలను వెంటనే జరిపించాలని సూచించారు. ఆర్‌టిసి మేనేజ్‌మెంట్ తన అవసరాల కోసం వాడుకున్న కార్మికుల డబ్బులు, పిఎఫ్, ఎస్‌బిటి, ఎస్‌ఆర్ డబ్బులను ఆయా సంస్థలకు వెంటనే చెల్లించాలని కోరారు. తార్నాక హాస్పిటల్‌లో ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాన్ని అందించడంతో పాటు ఉద్యోగుల తల్లి దండ్రులను కూడా రిఫరల్ హాస్పిటల్‌కు పంపి వైద్య సదుపాయం కల్పించాలని మొగుళ్ల రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇ.అశ్వద్ధామరెడ్డి(టిఎంయు), జక్కుల మల్లేశం గౌడ్(ఎస్‌డబ్ల్యుయు, ఐఎన్‌టియుసి), కె.హనుమంతు ముదిరాజ్(టిజెఎంయు), ఎం.నరేందర్(ఎన్‌ఎంయు), ఎ.వెంకటేశ్వర్లు(బిఆర్‌టియు), పి.హరికిషన్(ఎస్‌టిఎంయు), వై.స్వామికుమార్(బిఎంఎస్) తదితరులు పాల్గొన్నారు.

# ఎపి ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య స్టేట్ టాప్

## 470 కి 469 మార్కులు సాధించిన బి.గగన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియేట్ 2026 ఫలితాల్లో శ్రీచైతన్య స్టేట్ టాప్‌గా నిలిచిందని శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎగ్జామ్ ప్యాటర్న్, సిలబస్ మారినప్పటికీ ఎంపిసిలో 470 కి 469 మార్కులు సాధించి శ్రీ శ్రీచైతన్య విద్యార్థి బి.గగన స్టేట్ టాపర్‌గా నిలిచిందన్నారు. బైపిసిలో 455 మార్కులకు గాను 452 మార్కులతో శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్ ఇద్దరికి, సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 992 మార్కులతో 6 గురికి శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్క్, 991 మార్కులతో 37 మంది శ్రీచైతన్య విద్యార్థులే అని వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను 469 స్టేట్ టాప్ మార్క్ తో పాటు, 466 ఆపైన 129 మంది, 464 ఆపైన 1092 మంది, 460 ఆపైన 3620 మంది శ్రీచైతన్య విద్యార్థులే అని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపిసిలో 455 మార్కులకు గాను 452 మార్కులతో ఇద్దరికీ శ్రీచైతన్య స్టేట్ టాప్ మార్కు, 450 మార్కులు ఆపైన 132 మంది, 440 మార్కులు ఆపైన 1702 మంది, 435 మార్కులు ఆపైన 2356 మంది, 430 ఆపైన 2940 మంది శ్రీచైతన్య విద్యార్థులే అని పేర్కొన్నారు. శ్రీచైతన్య సృష్టించిన పటిష్టమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి ఆధ్యాపకులతో శిక్షణ వంటి ప్రత్యేకతల వల్లే ఇంటర్మీడియేట్‌లో సబ్జెక్ట్స్‌పై మా విద్యార్థులు కాన్సెప్ట్యువల్ గా పట్టు సాధించడంతో జాతీయస్థాయి పోటీపరీక్షల్లో టాపర్‌గా నిలుస్తున్నారని అన్నారు. స్ట్రాంగ్ ఫౌండేషన్ వల్లనే ఇంటర్మీడియెట్ స్టేట్ టాప్ మార్కులు సాధ్యమయ్యాయని, దీనితో పాటు రాబోయే రిజల్ట్స్‌లో కూడా అగ్రస్థానం శ్రీచైతన్యదే అనే నమ్మకం మాకుందని అన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను. మా విద్యాసంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులను, ఇంతటి ఫలితాలకు దోహదపడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని సుష్మ బొప్పన అభినందించారు.

# జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్

## డాక్టర్ కె.లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆదాయం (జిఎస్‌డిపి) ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనను బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఖండించారు. ఈ ప్రతిపాదన కాంగ్రెస్ పార్టీ అధికారికమా? కాదా? అనేది రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నోరు విప్పాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ అనేది ఎప్పుడైనా జనాభా లెక్కల ప్రకారమే జరుగుతదని, కానీ దీనిని ఆదాయం ఆధారంగా చేయడం రాజ్యాంగానికే విరుద్ధమని, ఇలాంటి ఆలోచన పట్ల దేశమంతా నవ్వుకుంటున్నదని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పిన 'ఒక వ్యక్తి ఒక ఓటు ఒకే విలువ' అనే సూత్రానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తోందని లక్ష్మణ్ ఆరోపించారు. ధనిక, పేద, కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ఓటు విలువ అందరికీ సమానంగా ఉండాలన్నదే రాజ్యాంగ స్ఫూర్తి అని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 81, 82, 170 ప్రకారం జనాభా లెక్కలే ప్రాతిపదిక అని, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా జిఎస్‌డిపి ఆధారంగా సీట్లు కేటాయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ధాన్యం కొనుగోళ్లను సంబంధించి అవసరమైనన్ని టార్పలిన్లు,తేమ పరికరాలు, ఆరబెట్టే యంత్రాలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.బుధవారం సచివాలయంలో మార్కెటింగ్, మార్క్ ఫెడ్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికీ పలు చోట్ల జీరో బిజినెస్ జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వస్తుందని, దీని పట్ల కఠినంగా వ్యవహరించాలని అవసరమైతే ట్రేడర్ల లైసెన్సు రద్దు చేయలన్నారు. జీరో బిజినెస్‌కు ఎవరైనా అధికారులు సహకరిస్తే క్రమశిక్ష చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని, వాటి పురోగతిని రోజు వారి సమీక్షించేటందుకు వీలుగా ఒక డాష్ బోర్డు ను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. మార్కెట్ యార్డ్ లకు వచ్చే రైతులకు సౌకర్యం కల్పించే పనులను ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టాలని అదేవిధంగా, పంట ఉత్పత్తులు రక్షించే విధంగా చేపట్టే పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా సూచించారు. మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగములో అవసరమైతే మరికొంత మందిని వేరే శాఖల నుండి డిప్యూటేషన్ పై తీసుకొనే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా సెక్రటరీ మంత్రి కోరారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీలో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్ ' సాఫ్ట్ వేర్ ల ద్వారా మార్కెట్ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. మంత్రి స్పందిస్తు ఒక సీజన్ లో అమలు చేసిన తరువాత, ఆశాజనక ఫలితాలు ఉంటే, అన్నీ మార్కెట్ యార్డ్ కమిటీలను డిజిటలైజేషన్ చేసి జీరో బిజినెస్ ను ఆరికట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి, మార్కఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నాలుగు దశాబ్దాల తర్వాత.. జగిత్యాల కాంగ్రెస్ నేతలు

## ముఖ్యమంత్రిని కలవడం చరిత్రాత్మకం

టిపిసిసి జనరల్ సెక్రటరీ గజ్జెల కాంతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలుగు దశాబ్దాల తర్వాత జగిత్యాల కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రిని కలవడం చరిత్రాత్మకమని టిపిసిసి జనరల్ సెక్రటరీ గజ్జెల కాంతం అన్నారు. గతంలో జగిత్యాల నేతలకు గాంధీ భవన్‌కు కూడా రావడానికి జీవన్‌రెడ్డి అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సొంత బిడ్డను, సొంత చెల్లిని పార్టీ నుంచి దూరం చేసిన నాయకులు ఇప్పుడు మాకు నీతులు చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన అనేక మంది నేతలను కెసిఆర్ పక్కనబెట్టారని ఆరోపించారు. ప్రొఫెసర్ జయశంకర్, విజయశాంతి, ఇన్నయ్య, ఈటెల రాజేందర్ల వంటి ప్రముఖులను కెసిఆర్ అవమానించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎన్నో అవకాశాలు ఇవ్వడంతో పాటు 14 సార్లు బి ఫారం ఇచ్చి, ఆరు సార్లు గెలిచినా పార్టీ ఆయనకు మద్దతుగా నిలిచిందని, అలాంటి పార్టీని విమర్శించడం తగదని సూచించారు.

## కేంద్రం చెప్పిన ధర కంటే తక్కువకు ఫోన్లు కొనడం సీతక్క చేసిన తప్పా?

మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమంపైనా ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి ఆరోపించారు. కేంద్రం చెప్పిన ధర కంటే తక్కువకు ఫోన్లు కొనడం మంత్రి సీతక్క చేసిన తప్పా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మంత్రి సీతక్కపై బిఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలు చేయడం దారుణమన్నారు. అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్లు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, కేంద్రం సూచించిన రూ.11,800 ధర కంటే రాష్ట్ర ప్రభుత్వం తక్కువకే రూ.11,650కే ఫోన్లు కొనుగోలు చేసిందని వివరించారు. ఆదివాసీలు, లంబాడీలు సాధారణంగా నిజాయితీగా ఉంటారని, అయితే సత్యవతి రాథోడ్ మాత్రం అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్‌లో చేరిన తర్వాత సత్యవతి రాథోడ్ అవినీతికి పాల్పడ్డారని, మంత్రిగా పని చేసిన సమయంలో జరిగిన వ్యవహారాలపై సత్య వతిరాథోడ్ చర్చకు సిద్ధమా అని శోభారాణి సవాల్ చేశారు. నక్సలైట్ దశ నుంచి ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్న సీతక్క నిజాయితీగానే పనిచేస్తున్నారని,తాను కూడా ఆమెతో కలిసి అండర్‌గ్రౌండ్‌లో పని చేశానని శోభారాణి తెలిపారు.



## అంపయ్యకు నివాళి

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** మాజీ చైర్మన్ కె.విప్లవ కుమార్ మామ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ విభాగం మాజీ చైర్మన్ అంపయ్య ఇటీవల పరమపదించారు. ఈ మేరకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు విప్లవకుమార్ ఇంటికి వెళ్లి అంపయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళ్లు అర్పించిన వారిలో ఖైరతాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## అలైవ్ అరైవ్ కార్యక్రమం

**ప్రజాపక్షం/సంతోష్‌నగర్ :** అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా వారోత్సవాలను సంతోష్‌నగర్ ట్రాఫిక్ విభాగం పరిధిలో బుధవారం నిర్వహించారు. ప్రజల్లో రహదారి నిబంధనలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ ట్రాఫిక్ సీఐ మొహమ్మద్ ఆసిఫ్ పాల్గొని కీలక సూచనలు చేశారు. ఇదిలాఉండగా... ఇండో ఆంగ్లో స్కూల్ విద్యార్థులతో కలిసి ప్రధాన జంక్షన్ వద్ద మానవ హారంగా ఏర్పడి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా వాహనదారులు, బాటసారులు, విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

## తమ్ముడిని హత్య చేసిన అన్న

**ప్రజాపక్షం/చాదర్‌ఘాట్ :** మద్యం మత్తులో వాగ్వాదం చోటుచేసుకోవడంతో జరిగిన కుమ్ములాటలో తమ్ముడు మృతిచెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉస్మాన్‌పురా ప్రాంతంలోని కేర్ ఆసుపత్రి వెనుక భాగంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు సఫ్దర్ హుస్సేన్(22), అన్న హాషీమ్ హుస్సేన్ అలియాస్ అస్లాం హుస్సేన్ (26) కూలీలుగా పనిచేస్తూ ఒకే ఇంట్లో నివసిస్తున్నారు.గత కొంతకాలంగా మృతుడు మద్యం సేవించి కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడుతున్నాడని సమాచారం. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి వచ్చి మరోసారి గొడవకు దిగాడు. ఆ సమయంలో ఆగ్రహానికి లోనైన అన్న హాషీమ్, తమ్ముడు సఫ్దర్ మధ్యన ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే అన్న కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన తమ్ముడు సఫ్దర్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. కుటుంబ కలహాలే ఈ హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

దేశ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్రాలకు

# తగిన ప్రాతినిధ్యం కల్పించాలి

టిపిసిసి ఇంటెలెక్చ్యువల్ సెల్ చైర్మన్ అన్నతుల శ్యామ్ మోహన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ అభివృద్ధికి ఎక్కువగా సహకరిస్తున్న రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని టిపిసిసి ఇంటెలెక్చ్యువల్ సెల్ చైర్మన్ అన్నతుల శ్యామ్ మోహన్ అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సమాన ప్రాతినిధ్యం ముఖ్యమని, అమలు విధానం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని సూచించారు. అభివృద్ధి, జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. 2011 జనగణన ఆధారంగా మాత్రమే డిలిమిటేషన్ చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఆర్థిక వృద్ధి, ఐటి, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో ముందంజలో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్'కు ఆయన తన మద్దతు ప్రకటించారు. జనాభా ఆధారిత ప్రాతినిధ్యంతో పాటు పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలతో కూడిన ఈ విధానం సమతుల్య పరిష్కారంగా ఉంటుందని సూచించారు. ఈ అంశంలో ఉత్తర దక్షిణ విభేదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలి**

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలని శ్యామ్ మోహన్ ప్రతిపాదించారు. నగరంలోని ఆధునిక మౌలిక వసతులు, అనుకూల వాతావరణం, భౌగోళిక స్థానం వంటి అంశాలు ఇందుకు అనుకూలమన్నారు. 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్‌తో హైదరాబాద్‌కు మరింత ప్రాధాన్యత పెరుగుతుందని తెలిపారు. దక్షిణ భారత ప్రజలకు న్యాయసేవలు సులభం చేసేందుకు హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త హైకోర్టు సముదాయాన్ని విస్తరించి సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయవచ్చన్నారు. తెలంగాణలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇది యువతకు నైపుణ్యాలు పెంపొందించడంలో సహాయపడుతుందన్నారు. దేశంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సూచనలు చేస్తున్నానని, ఐక్యత, సమానత్వం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగాలని శ్యామ్ మోహన్ తెలిపారు.

## రహదారి భద్రతపై అవగాహన

అబిడ్స్ ట్రాఫిక్ సిఐ మధుసూదన్

**ప్రజాపక్షం/అబిడ్స్ :** ప్రతి విద్యార్థి ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ ఇన్ స్పెక్టర్ మధుసూధన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్‌అలైవ్ కార్యక్రమాని అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గర్ల్స్ గ్రామర్ స్కూల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు దాటే ముందు కుడి, ఎడమ వైపు చూసి వాహనాలు రావడం లేదని నిర్ధారించుకున్నాకే ముందుకు సాగాలన్నారు. ఎల్లప్పుడూ జీబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేదంటే సబ్‌వేలను మాత్రమే ఉపయోగించాలని, ఫుట్‌పాత్ లేని చోట, వాహనాలకు ఎదురుగా నడవాలని, తద్వారా వాహనాలను గమనించగలుగుతామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పాండురాజు, హన్మంతరావు, ప్రిన్సిపాల్ రూత్‌ల జ్యంతి, ఉపాధ్యాయులు అరుంధతి, మృధుల, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచనలు యువతకు స్ఫూర్తి

**ప్రజాపక్షం/బంజారాహిల్స్ :** అంబేద్కర్ ఆలోచనలు నేటి యువతకు ఎంతో ప్రేరణ ఇస్తాయని రెసోనెన్స్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రారావు నర్రా కొనియాడారు. ఈ మేరకు కాలేజీలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి సంస్థ సీఓఓ మార్కండేయ, జీఎం మల్లేష్ పాల్గొన్నారు.



## విప్లవాన్ని స్వప్నించిన మురళి

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** ప్రశ్నించే గొంతుక మూగబోయింది.. విప్లవాన్ని స్వప్నించి.. సమాజ మార్పును ఆకాంక్షించిన చిక్కు మురళీమోహన్‌ను పలువురు స్మరించుకున్నారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మురళి సంస్మరణ సభలో మిత్రులు, వివిధ ఎన్‌జీఓ సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. అమరుడు చిక్కు మురళీమోహన్ వ్యక్తిత్వం, జీవితం బాలల కోసం చేసిన సేవలను గుర్తుచేసుకుని ఘన నివాళులు అర్పించారు. సభకు ఎంవిఓ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్‌వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జనవాని సంస్థ డైరెక్టర్ ప్రతాప్ జెర్ర మాట్లాడుతూ, చిక్కు మురళీమోహన్ చేసిన పోరాటం ఎన్నటికీ మరువలేనిదంటూ ఆయన చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. బాల్యవివాహాలు ఆపాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జరగాలని.. ఆ దిశగా అనేక పోరాటాలు నిర్మాణం చేశారని కొనియాడారు. సమావేశంలో పాల్గొన్న శాంతాసిన్హా మాట్లాడుతూ.. మురళి చేసిన కార్యక్రమాల గురించి సంక్షిప్తంగా వివరించారు. కార్యక్రమంలో తలారి సత్యం, సర్దార్ లింగం, డాక్టర్ సాయన్న, కామేశ్వరి, ఉప్పలయ్య, విష్ణు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భర్తరఫ్ చేయాలి



యాదవ జెఎసి రాష్ట్ర కమిటీ డిమాండ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పేద రైతుల భూములను ఆక్రమిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రివర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని యాదవ జెఎసి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆయనకు సహకరించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి నాయకులు, భూ బాధితులు పలు ఆరోపణలు చేశారు. సిద్దిపేట పట్టణంలోని రంగధంపల్లి గ్రామంలో సర్వే నెంబర్లు 974, 975, 978, 979, 988, 1005, 1006లో ఉన్న 42 ఎకరాల భూమిని 1960లో రాగం మల్లయ్య కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆయన వారసులు రాజయ్య, రఘు, మోహన్ ఆ భూమిలో సాగు చేస్తూ జీవిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రైతు బంధు ప్రయోజనాలు కూడా పొందుతున్నారని తెలిపారు. దశాబ్దాలుగా సాగులో ఉన్న ఈ భూమిపై మంత్రి పొన్నం ప్రభాకర్ కన్నేశారని, తన రాజకీయ ప్రభావంతో సంబంధం లేని వ్యక్తుల ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయించారని జెఎసి నేతలు ఆరోపించారు. క్షేత్రస్థాయి పరిశీలన (పంచనామా) చేయకుండా, కలెక్టర్ తన పరిధి దాటి కుటుంబ ఆస్తుల పంపకాలు చేశారని, అసలు సాగుదారులకు వాటా ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. మంత్రి తన అధికార దుర్వినియోగంతో భూమిని తన అన్న కుమారుడు పొన్నం అనూప్ కుమార్ పేరుతో కొనుగోలు చేసినట్లు పత్రాలు సృష్టించారని ఆరోపించారు. బాధిత రైతు రాగం శ్రీనివాస్ యాదవ్ కుటుంబానికి ప్రాణహాని ఉందని, వారికి ఏదైనా అపాయం జరిగితే మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వం బాధ్యత వహించాలని జెఎసి స్పష్టం చేసింది. మీడియా సమావేశంలో యాదవ జేఏసీ చైర్మన్ దాసరి అజయ్ యాదవ్, వైస్ చైర్మన్ చిలకల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి భీనవేణి మల్లేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగుల మధు యాదవ్, అడ్వకేట్ అరుణ్ యాదవ్, ఓయూ బీసీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఆరోపణలను ఖండిస్తున్నాం: సులోచన రాణి**

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని భూమిని విక్రయించిన పట్టాదారులు సులోచన రాణి పేర్కొన్నారు. ఇదే విషయంపై ప్రెస్ క్లబ్‌లో సులోచన రాణి మాట్లాడుతూ, ఇది పూర్తిగా తమ కుటుంబ వ్యవహారమని, అన్నదమ్ముల మధ్య ఉన్న భూమిని స్వచ్ఛందంగా శ్రీ బాలాజీ రియల్ ఎస్టేట్‌కు విక్రయించామని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు గానీ, అధికార దుర్వినియోగం గానీ జరగలేదని స్పష్టం చేశారు.



## వాహనదారులకు హెల్మెట్‌ల పంపిణీ

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట :** అలైవ్ అరైవ్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ లేని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ మేరకు బార్కాస్ కేంద్రీయ విద్యాలయం, సీఆర్పీఎఫ్‌లో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహిస్తూ, హెల్మెట్లు ధరించని ప్రయాణికులకు చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎం.దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో

## 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

రానున్న మూడు రోజులు వడగాలులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే ఉక్కపోత ప్రారంభం కాగా, మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఈ నే పథ్యంలో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి ఉన్నాయి. ఇవాళ నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

**పిల్లలు, గర్భిణులు, వృద్ధులు జాగ్రత్త..**

పిల్లలు, వృద్దులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని వాతావరణ శాఖ పేర్కొంది. బయటకు వెళ్లినప్పుడు ఎండ దెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, తాగు నీరు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని సూచించారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది కలిగితే ఆలస్యం చేయకుండా తక్షణమే సమీపంలోని దవాఖానకు వెళ్లాలన్నారు.

## 18న తెలంగాణ ఉద్యమకారుల సదస్సు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుల సదస్సును ఈ నెల 18న తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్టు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సుకు ఉద్యమకారులంతా హాజరు కావాలని కోరారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఫోరం నేతలు జి.దయానంద్, జగన్ యాదవ్, నాగజ్యోతి, మంజూష, శ్యామల, జోగు అంజయ్య తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎంఎల్‌ఏలు మందుల శామ్యూల్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు కమిటీ వేస్తామని గత నెలలో ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి నియమించలేదని, వెంటనే కమిటీ వేయాలని కోరారు. సదస్సులో ఉద్యమకారులతో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

## ఉపాధ్యాయులకు 'ఎడాటాకీస్' ఎఐ ప్లాట్‌ఫాం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** భారతీయ విద్యారంగంలో డిజిటల్ అంతరాలను తగ్గించేందుకు అమెరికాకు చెందిన 'ఎడాటాకీస్' ఏఐ ఆధారిత ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫాం సేవలను విస్తరిస్తున్నామని సంస్థ సిఇఒ రామ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల స్థానాన్ని భర్తీ చేయడం కాకుండా, వారి బోధనా సామర్థ్యాన్ని పెంచడమే ఈ ప్లాట్‌ఫాం లక్ష్యమని తెలిపారు. దేశంలో డిజిటల్ విద్య వినియోగం కోవిడ్ సమయంలో 70 శాతం వరకు పెరిగినా, ప్రస్తుతం 55 శాతం వద్ద స్థిరపడిందన్నారు. ఎడాటాకీస్ ప్రత్యేకంగా ఉపాధ్యాయ కేంద్రిత విధానంతో రూపొందించడం జరిగిందని.. ఉపాధ్యాయులు తక్షణమే లెసన్ ప్లాన్లు, అసెస్మెంట్లు రూపొందించుకునే అవకాశం ఉండగా, తక్కువ ఇంటర్నెట్ ఉన్నా వాట్సాప్ ద్వారా పాఠాలు అందించే సౌకర్యం కల్పించామన్నారు.



## ఒడియా రాజుల చరిత్రను వెలుగులోకి తేవాలి

మాజీ పురావస్తు శాఖ అధికారి కావూరి శ్రీనివాస్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ఉభయ తెలుగు రాష్ట్రాలను దాదాపు 90 ఏండ్లకు పైగా పాలించిన ఒడియా రాజుల చరిత్రను వెలుగులోకి తీసుకురావాలని మాజీ పురావస్తు శాఖ అధికారి కావూరి శ్రీనివాస్, స్వతంత్ర చారిత్రక పరిశోధకుడు బిష్ణు మోహన్ రెండు రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కపిలేంద్ర గజపతిరాజు శ్రీకూర్మం (ప్రస్తుత శ్రీకాకుళం) కేంద్రంగా పాలన ప్రారంభించినట్లు తెలిపారు. ఆ కాలంలో చెక్కిన శాసనాలు ఇందుకు నిదర్శనమని అన్నారు. కాకతీయులు పాలించిన వరంగల్ ప్రాంతంలో కూడా ఒడియా రాజుల శాసనాలు లభించాయని... దక్షిణ భారతంలో మరుగున పడిన హిందూ రాజుల చరిత్రను వెలికి తీయాల్సిన అవసరం ఉందని, ఒడియా రాజులకు బాదామి, వేములవాడ చాళుక్యులు, కళింగ రాజులతో సంబంధాలు ఉన్నాయని వివరించారు. విజయగణ సూర్యవంశ రాజుల శాసనాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజారంజక పాలనతో పాటు దానధర్మాల్లో విశేష పాత్ర పోషించిన ఒడియా రాజుల చరిత్రను పాఠ్యపుస్తకాలలో పొందుపరచి భవిష్యత్ తరాలకు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.



## 'పాలమూరు' నిర్లక్ష్యంపై పాదయాత్రలు

మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాలమూరు ప్రాజెక్ట్‌ల నిర్లక్ష్యంపైన ఇక తాము ప్రత్యక్ష యుద్ధానికే పూనుకుంటామని, ప్రభుత్వంపైన వత్తిడి పెంచేందుకు మండుటెండల్లో కూడా పాదయాత్రలు నిర్వహిస్తామని బిఆర్ఎస్ మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌పైన 'మే' మొదటి వారంలో తమ కార్యచరణ పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఏలు జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే వానాకాలంలో ఖచ్చితంగా పాలమూరు రిజర్వాయర్లను నింపాలని, దీనికి సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలన్నారు. కెఎల్ఐ నీళ్లను ఎలాంటి ఆంటంకం లేకుండా ఆ ప్రాంతానికి నీళ్లు చేరేలా చర్యలు తీసుకోవాలని, గొల్లపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1956కు ముందు పాలమూరు అత్యధిక వ్యవసాయ భూములు, చెరువులు, కుంటలు, బావులతో సస్యశ్యామలంగా ఉండేదని ఆయన గుర్తు చేశారు. సమైక్య రాష్ట్రంలో విలీనమైన తర్వాత పాలమూరు జిల్లా వలసల, కరువు,ఆకలి జిల్లాగా మారిందన్నారు. ప్రభుత్వ సామాజిక ఆర్థిక సర్వే2014 ప్రకారం పాలమూరు జిల్లాలో తలసరి ఆదాయం రూ 74 వేలు అని, కానీ 2024 25 నాటికి 352.86 శాతం పెరిగి రూ.3,36,898లకు చేరిందని వివరించారు. పాలమూరు జిల్లాలో ఆర్థిక, రాజకీయ, సాంఘీక చైతన్యానికి ఇదొక ప్రతిరూపమని అభివర్ణించారు.

## 'స్పా' ముసుగులో దందా?

**ప్రజాపక్షం/గోషామహల్ :** ఒత్తిడిని జయించి.. దేహానికి విశ్రాంతి ఇద్దామని.. మసాజ్, స్పా సెంటర్లకు వెళ్లే కస్టమర్లను ఆకట్టుకుంటూ నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ముందుగా సాధారణ మసాజ్ పేరుతో రిసెప్షన్ నుంచి లోపలి క్యాబిన్లలోకి తీసుకెళ్తారు. ఆ తర్వాత అసలు కథ మొదలవుతుంది. థెరపిస్టు, నిర్వాహకులు మెల్లగా మాటలు కలుపుతూ, బాడీ మసాజ్ నుంచి ఎక్స్‌ట్రా సర్వీసుల వైపు కస్టమర్ల మనసు మళ్లిస్తారు. మొదట్లో వద్దనుకునే వారిని సైతం రకరకాల ప్యాకేజీలు, మాటల గారడీతో ఉచ్చులో పడేలా మానిప్యులేట్ చేస్తారు. చివరికి ఆ మసాజ్ కాస్తా ఇతర అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దారి తీస్తుంది. కొందరు కావాలనే వెళుతుంటే, మరికొందరు అమాయకులు ఈ ఆకర్షణలో పడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఇదిలాఉండగా... క్యూర్ జోన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో మసాజ్, స్పా సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అడపాదడపా టాస్క్ ఫోర్స్, ఎస్‌ఓటీ దాడులు నిర్వహిస్తున్నా.. కొద్దిరోజులు మూసివేసి తిరిగి తెరుస్తున్నారు. ఈ వ్యవహారాల్లో స్థానిక పోలీసులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సెంటర్లకు కొందరు అవినీతి సిబ్బందే పరోక్షంగా రక్షణ కవచంలా నిలుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా ఈ వ్యవహారాలకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనర్లు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు

తెలంగాణ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్‌రెడ్డి

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** దూరదర్శన్ ఛానల్ యాంకర్ లైవ్ డిబేట్‌లో రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలంగాణ యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన బేగంబజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యాంకర్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను అవమానించేలా ఉన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి 'ఇంటింటికి సిపిఐ'

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్‌లో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వాటి పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లోని ప్రతి కాలనీలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. అన్ని వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలి. సురక్షితమైన మంచినీటి సరఫరాను క్రమబద్ధీకరించాలి. చీకటిలో ఉన్న ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం స్థానిక యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నిమ్మల నర్సింలు, మేడ్చల్ జిల్లా గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి చిలుముల మల్లేష్, ఎఐటియుసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, పార్టీ నాయకులు డి.మల్లిక, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



## న్యూ చైతన్య కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఇంటర్ ఫలితాల్లో న్యూ చైతన్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పెయింటింగ్ పనిచేసే ఒక సాధారణ కుటుంబం నుండి వచ్చిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కె అంజలి 1000 మార్కులకు గాను 993 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు రావడం గర్వ కారణం.మైథిలి బిపిసిలో 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించింది. ప్రథమ సంవత్సరం విద్యార్థి టి. స్నేహనస్ ఎంపిసిలో 470 మార్కులకు గాను 466 మార్కులు,జాన్వీ సోనీ బిపిసిలో 440 మార్కులకు గాను 435, రోహిత్ మిశ్రా ఎస్ఇసిలో 500 మార్కులకు గాను 488 మార్కులు వచ్చాయి.ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్ టి. ఉదయభాస్కర్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు క్యాష్ అవార్డుతో పాటు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ టి ప్రదీప్, శ్యామ్, అనిల్, ప్రిన్సిపాల్ వెంకటేష్,వంశీ, తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని ఎస్ఆర్ డిజి స్కూల్ విద్యార్థులతో బుధవారం మల్కాజిగిరి ఎసిపి యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ ప్రయాణీకులందరూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రమాదాల నివారణలో భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్, ఎస్సైలు అవినాష్, ట్రాఫిక్ ఎస్సై రవికుమార్‌రెడ్డి, సూర్య, ఎస్ఆర్ డిజి స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ టీచర్లకు సెల్ ఫోన్‌ల పంపిణీ

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్ బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం 190 మంది అంగన్ వాడి టీచర్లకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ అంగన్ వాడి సెంటర్‌లలో చిన్నారులకు పోషక ఆహారాలను సక్రమంగా అందించాలని సూచించారు. అంగన్ వాడి టీచర్ల సమస్యలను తనవంతు బాధ్యతగా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ అధికారిణి రేణుక, సూపర్ వైజర్లు కృష్ణ ప్రియ, భాగ్య, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## పవర్ బోరు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి ఎంపి నిధులతో మంజూరైన పవర్ బోరు పనులను మౌలాలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ బుధవారం జవహర్‌నగర్ కాలనీలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ చౌదరి, నటరాజ్, చింతల శేఖర్, శిరీష తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్:** సిఆర్పిఎఫ్ అరుంధతి నగర్‌కు చెందిన స్వామి (25)అనే యువకుడు గత రెండు రోజులుగా కనిపించకుండా పోవడంతో స్థానికంగా కలకలం రేగుతోంది. జవహర్ నగర్ ఎస్‌హెచ్‌వో సైదులు తెలిపిన వివరాల ప్రకారం అరుంధతి నగర్ నివాసి అయిన గగనం లలిత భర్త స్వామి, చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, ఈ నెల 13.04.2026 (సోమవారం) రాత్రి 11 గంటల సమయంలో కాలనీలో చిన్నపాటి గొడవ జరిగింది. ఆ గొడవ జరిగిన వెంటనే, బయటికి వెళ్లి వస్తాను అని భార్యకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన స్వామి, తిరిగి రాలేదు. రాత్రంతా భర్తకోసం వేచి చూసిన లలిత, మరుసటి రోజు చుట్టుపక్కల ప్రాంతాల్లో బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆస్తి పన్ను చెల్లింపునకు నగదు స్వీకరణ ఉండదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆస్తి పన్ను చెల్లింపులకు సంబంధించి నగదు స్వీకరణ ఇక ఉండబోదని, ఎవరికి డబ్బులు ఇవ్వొద్దని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. ఆన్‌లైన్, యుపిఐ, మై క్యూర్ మొబైల్ యాప్, పౌర/మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలన్నారు. బిల్ కలెక్టర్లకూ యుపిఐ లేదా చెక్కుల రూపంలో పన్నులను చెల్లించాలని తెలిపారు. ఎర్లీ బర్డ్‌లో భాగంగా ప్రస్తుత జిహెచ్ఎంసి పరిధిలో రూ.450 కోట్ల పన్ను వసూలవుతుందనే అంచనాలు ఉన్నాయని వివరించారు. 'ఎర్లీ బర్డ్' 5 శాతం రాయితీ బ్రోచర్‌ను జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో 'ఎర్లీ బర్డ్'లో భాగంగా ఇప్పటి వరకు రూ.93.02 కోట్ల పన్ను వసూలైందని, 1, 11,472 మందికి రూ.4.71 కోట్ల రాయితీ లభించిందని వివరించారు. 'మై జీహెచ్ఎంసి యాప్' స్థానంలో వచ్చిన 'మై క్యూర్ యాప్' ద్వారా పన్ను చెల్లించాలని సూచించారు. నివాసేతర భవనాల పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈనెల 30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, ఒకేసారి అందరూ పేమెంట్ చేస్తే సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందుకే అందరూ ఈ నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిహెచ్ఎంసీ చట్టంలోనే ఎర్లీ బర్డ్ ఆఫర్ ఉందని, పొడిగింపునకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ జోన్‌లో అత్యధికంగా రూ.40కోట్లు, గొల్కొండలో రూ.16కోట్లు, సికింద్రాబాద్‌లో రూ.15 కోట్లు, శంషాబాద్‌లో రూ.6.50 కోట్లు, చార్మినార్‌లో రూ.7 కోట్ల పన్ను వసూలైందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి అదనపు కమిషనర్లు ప్రియాంక ఆల, రాధికా గుప్తా, సివిఒ రజనీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటమే ఏకైక మార్గం

### మున్సిపల్ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర మున్సిపల్ అధ్యక్షులు కె. రవిచంద్రన్ అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో మహిళా భవన్‌లో సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ అధ్యర్యంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్మికులు కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. రవిచంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మనెంట్ చేయాలని కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు పనిచేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి మరణించిన కార్మిక కుటుంబానికి 30 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని కార్మికుల వేతనంలో గత ఆరు నెలల నుండి పిఏఫ్ కోత విధించినప్పటికీ కార్మికుల అకౌంట్లో ఇప్పటివరకు జమ కాకపోవడం బాధకరమని అన్నారు.

60 సంవత్సరాలు పైబడిన మరణించిన అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబం నుండి ఒకరికి వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కార్మికులకు ఇఎస్ఐ, డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని జనాభాకు అనుగుణంగా కార్మికుల ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం అధ్యక్షులు లొట్టి ఈశ్వర్, మంచల రామ్ చందర్, జిల్లా మున్సిపల్ ఉప ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా నాయకులు బాబు, సర్కిల్ అధ్యక్షురాలు సువర్ణ, ఉపాధ్యక్షులు శ్రీరాములు,కార్యదర్శి రాజు, కోశాధికారి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల జరిగిన పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం పటిష్టమైన ఏర్పాట్ల మధ్య జిల్లాలోని బాలానగర్‌లోని ఎన్ఎస్‌కెకె పాఠశాలలో ప్రారంభమయ్యాయి. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం ఈ కేంద్రాన్ని డిఈఓ విజయకుమారితో కల్సి ఆయన సందర్శించి మూల్యాంకన విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమాధాన పత్రాల దిద్దుబాటులో ఎలాంటి పొరపాట్లు రాకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మూల్యాంకన విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు అవసరమైన తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూలర్లు వంటి అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయటంలో నిర్లక్ష్యం పనికి రాదన్నారు. నిర్దేశించిన గడువులోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేసి పరీక్షా ఫలితాల విడుదలకు సహకరించాలని, ఈ కేంద్రాల్లోకి అనధికారిక వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు.

## ఆకాశాన్ని తలదన్నే అక్రమ నిర్మాణాలు

### టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై విమర్శలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలు ఆకాశాన్ని తలదన్నేలా సాగుతున్నాయి. అనుమతులు ఒకలా తీసుకుంటున్న నిర్మాణదారులు నిర్మాణాలు మరోలా సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నా అధికారులు కన్నెత్తి చూడడంలేదు. కాసులకు కక్కుర్తి పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు పరోక్ష సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంపల్లి సర్కిల్‌లో ఉన్నతాధికారుల సమన్వయలోపం ఇక్కడ అక్రమ నిర్మాణదారులకు కలిసొచ్చే అంశంగా మారింది.

జి ప్లస్ 3 మున్సిపల్ అనుమతులు పొందిన నిర్మాణదారులు పరదాల చాటున జి ప్లస్ 5 బహుళ అంతస్తులు నిర్మిస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. కొంపల్లి సర్కిల్ లోని సుభాష్ నగర్ డివిజన్, సాయి బాబానగర్ డివిజన్ తోపాటు జయభేరి కాలనీ దూలపల్లి డివిజన్, అపర్ణా ఫామ్ మెడోస్ ప్రాంతాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్న అధికారులు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది. కొంపల్లి సర్కిల్ లో అధికారుల సమన్వయ లోపం కొట్టిచ్చినట్లు కనబడుతుంది. టౌన్ ప్లానింగ్ ఏసీపీ సమాధానాలు దాటవేస్తుండడం,డిప్యూటీ కమీషనర్‌ను వివరణ కోరితే సంబంధం లేనట్లుగా వ్యవహరించడం అధికారుల సమన్వయలోపానికి అద్ధంపడుతుంది.

టౌన్ ప్లానింగ్ ఏసీపీ,డిప్యూటీ కమీషనర్ ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తుండడం తో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నా యి. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు, డిప్యూటి కమీషనర్ కొంపల్లి సర్కిల్‌లో జరుగుతున్న, అనుమతి లేని అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ ఎన్.కృషారెడ్డిని వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణాలను కూల్చువేసామన్నారు. అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని లేనిపక్షంలో చర్యలు చేపడతామని అన్నారు.



## ఘనంగా పోషణ పక్వాడ కార్యక్రమం

**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట మండలంలోని చిట్టిగిద్ద గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని అంగన్‌వాడి కేంద్రంలో మండల అంగన్వాడీ సూపర్వైజర్ కవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, పోతురాజు హంస,రూతమ్మతో కలిసి పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా 0 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు సమతుల్య ఆహారం, శుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై వివరంగా తెలియజేశారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా శిశువుల మెదడు అభివృద్ధి మెరుగుపడుతుందని నిపుణులు సూచించారు. అదనంగా, గ్రామంలో పోషణ పంచాయితీ నిర్వహించి, ప్రజల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పోషకాహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్, మెడికల్ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, గ్రామ పెద్దలు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

### ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రోడ్డు భద్రత నియామలను ఖచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ నిబంధనలపై విద్యా ర్థులకు అవగాహన కల్పిస్తున్నామని శామీర్ పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. గురువారం హకింపేటలోని స్పోర్ట్స్ స్కూల్లో పిల్లల రోడ్డు భద్రత దినోత్సవాన్ని శామీర్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనాద్ మాట్లాడుతూ పాదచారులు రోడ్డుదాటే క్రమం లో నిర్లక్ష్యంగా చేసే డ్రైవింగ్ వలన కలిగే ప్రమాదాలను వివరించారు. హెల్మెట్ తప్పకుండా ధరించాలని హెల్మె ట్ ప్రాముఖ్యతను వివరంగా తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ఎంత ముఖ్యమో వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హెల్మెట్ ధరించాలనే సందేశంలో విద్యార్థులచే లేఖలు రాయించారు. కుటుంబ స్థాయి లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జీబ్రా కాస్టింగ్ వినియోగం, ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించుట, రోడ్డు వినియోగంలో క్రమశిక్షణ, విద్యార్థులు రోడ్డు భద్రత రాయబారులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహం గా, చురుకుగా పాల్గొన్నారు. ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, ఓఎస్‌డి మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం /పరిగి :** మున్సిపల్ పరిధిలోని మల్కపూర్ సమీపంలోని పరిగిషాద్ నగర్ ప్రధానరోడ్డుపై ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు ,పోలిసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నయి.. పెయింటింగ్ పనులుపూర్తి చేసుకుని తిరిగి తమ పూడూర్ మండల సోమనగుర్తి గ్రామాల చెందిన రామకృష్ణ , రంగాపూర్ గ్రామనికి చెందిన అంజనేయులు గ్రామానికి వెళ్తుండగా యూటర్న్ తీసుకునే సమయంలో బైకు అతివేగంతో కారును ఢీ కొట్టి ఎగిరిపడిఅ క్కడికక్కడే ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలనికి పోలీసులు చేరుకు కెసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని అన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## హామీలు మేళం..అమలు శూన్యం

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకు పెరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. బుధవారం పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ సభలో ముఖ్య అతిథిగా పాల్గొ న్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఘాటైన విమర్శలు గుప్పించారు. ఈ సభకు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడకు చెందిన నాయకులు కొడె పోచయ్య, ఆకుల మధుకర్‌లను కెటిఆర్‌కు కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మాజీ మేయర్ మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఓ వైపు కూల్చివేతలు.. మరోవైపు నిర్మాణాలు..

### నిజాంపేట్ సర్కిల్‌లో కొనసాగుతున్న దందా



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఓ వైపు అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాలను కూల్చివేస్తున్నా మరో వైపు అనుమతుల్లేకుండా షెడ్లను నిర్మిస్తున్నారు. ఏకండా షెడ్లను నిర్మించి యథేశ్చగా వ్యాపారాలను నిర్వహిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. పట్టా స్థలాలను కనీసం కన్వర్షన్ చేసుకోకుండా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకోవడం నిజాంపేట్ సర్కిల్‌లో కొనసాగుతున్న తంతు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జోన్, నిజాంపేట్ సర్కిల్‌లో అనుమతులకు మించి, జీరో అనుమతుల్లో ఏకంగా ఐదు, ఆరు, ఏడు అంతస్థుల భవంతులను నిర్మించడం ఇక్కడ సర్వసాధారణం. ఇది లా ఉండగా పట్టా స్థలాల్లో కనీసం నాలా కన్వర్షన్ కూడా చేసుకోకుండా స్విమ్మింగ్ పూల్‌లను, బ్యాడ్మింటన్ కోర్టులను, ఇండోర్ గేమ్స్ వంటి వ్యాపారాలను యథేశ్చగా సాగిస్తున్నా పట్టించుకోవడం లేరు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లలో అనుమతులకు మించి నిర్మించిన బహుళ అంతస్థుల భవనాలకు మూడు సార్లు నోటీసులను జారీ చేయడంతో పాటు వరుసగా కూల్చివేతలను సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చేపడుతున్నారు. ఓ వైపు బహుళ నిర్మాణాలను కూల్చివేస్తుంటే మరో వైపు అక్రమంగా స్విమ్మింగ్ పూల్‌లను నిర్మించడం గమనార్హం. బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లో బుధవారం ఏకంగా మూడు భవనాల స్లాబ్‌లను కూల్చివేశారు. కాగా బాచుపల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి వెళ్లే దారిలో మాత్రం ఏకంగా కనీస అనుమతులు లేకుండా స్విమ్మింగ్ పూల్‌ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్విమ్మింగ్ పూల్‌కి ఓ సారి నోటీసుని జారీ చేసినట్లు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తెలిపారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణ దారుడు ఓ నేత పేరు వాడుకుని నిర్మాణపు పనులను కొనసాగించడం విశేషం. సర్కిల్ అధికారులు అనుమతులు లేకుండా షెడ్ల పై, వ్యాపారాలను నిర్వహించే వాటి పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్రిడిటేషన్ కమిటి ఏర్పాటైంది. జిల్లా కలెక్టర్ మనుచౌదరి చైర్మన్ గా వ్యవహరించే ఈ కమిటిలో పెద్ద పత్రికలు, మధ్య తరగతి పత్రికలు, చిన్న పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, వీడియో జర్నలిస్టు, ఉర్దు పత్రిక, ఫొటోగ్రాఫర్ విభాగాలతో పాటు నాలుగు వేర్వేరు జర్నలిస్టు యూనియన్లు, ఆర్టీసీ నుండి డిపో మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, ఐ అండ్ పిఆర్, డిపిఆర్ఓ కార్యాలయాల నుండి ఒక్కొక్కరిని సభ్యులుగా నియమించారు. తెలంగాణా స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు పక్షాన ఎం.వెంకటరెడ్డి, తెలంగాణా యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల పక్షాన ఉల్లెంగ రామారావు, తెలంగాణా వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ పక్షాన (పెండింగ్), తెలంగాణా జర్నలిస్టు అసోసియేషన్ పక్షాన మహ్మద్ యూసూఫుద్దీన్, పెద్ద పత్రికల నుండి సునీల్ కుమార్, ఉర్దూ దినపత్రికల నుండి సయ్యద్ అబ్దుస్ సమి, మధ్య తరగతి పత్రికల పక్షాన బాలరాజు, ఎలక్ట్రానిక్ మీడియా నుండి కొండూరి ప్రసాద్, ఫొటోజర్నలిస్టు నుండి రాజేష్ రెడ్డి, వీడియో జర్నలిస్టు నుండి సిహెచ్ భూపాల్‌లను నియమించారు. జర్నలిస్టుల నుండి అందిన ధరఖాస్తులను ఈ కమిటి క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే బాధ్యత చేపడుతుంది.



## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికి అవగాహనా కలిగి ఉండాలని నవాబుపేట ఎస్సై గిరి అన్నారు. బుధవారం నవాబుపేట్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు చిల్డ్రన్స్ రోడ్డు సేఫ్టీ డే గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి మాట్లాడుతూ..రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వాడటం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. దేశంలో ప్రతి సంవత్సరం వేలాదిమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యం చిన్నారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం.రోడ్డు నియమాలు మన భద్రత హెల్మెట్ ప్రాముఖ్యత ట్రాఫిక్ నియమాల పాటించడం వంటి అంశాలపై విద్యార్థులు ఆసక్తిగా వ్యాసాలు రాశారు. అనంతరం విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల గురించి వివరించి రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు, సిగ్నల్స్ ప్రాముఖ్యత, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే ఈ నియమాలు తెలుసుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. వ్యాస రచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, కాలేజ్ అధ్యాపకులు, పోలీస్ అధికారులు కలిసి ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే సమాజంలో రోడ్డు భద్రతపై చైతన్యం పెరుగుతుందని ఎస్సై గిరి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, పోలీస్ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్‌లో:** దౌల్తాబాద్ మండలం గోకాపసల్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ట్రాపిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తమ అమ్మానాన్నలకు ఉత్తరం ద్వారా నియమాలను రాయించి చదివించాలని కోరారు. ప్రతి వాహనదారుడె హెల్మెట్ లేకుండా బైక్‌ని నడపకూడదని, మద్యం సేవించి వాహనాన్ని నడపకుడదని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, అతివేగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

## కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** భరత్ నగర్, కౌకూర్ ప్రాంతానికి చెందిన ఒక డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. జవహర్ నగర్ ఎస్ హెచ్ వో సైదులు తెలిపిన వివరాల ప్రకారం కౌకూర్ నివాసి దొమ్మరి బేబీ కుమార్తె భవాని (19) ఈసీఐఎల్ లోని ఒమేగా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 13.04.2026 (సోమవారం) ఉదయం 7:30 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటినుండి బయలుదేరిన భవాని, సాయంత్రం అయినా తిరిగి రాలేదు. ఆందోళన చెందిన తల్లి బేబీ, కాలేజీకి వెళ్లి విచారించగా తన కుమార్తె ఆ రోజు అసలు కాలేజీకే రాలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ భవాని ఆచూకీ లభించలేదు. కుమార్తె కనిపించకపోవడంతో తల్లి బేబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, సిసిటివి ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

# ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ సూచించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులతో బుధవారం వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అంధించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. త్వరలో ఎస్ఐఆర్‌లో ఓటర్ల తొలగింపు, చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో టిపిసిసిఇ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, శ్రీపాల్‌రెడ్డి, బండా సురేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, లింగాల కిషోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మంజులరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, మెగావత్ గణేష్ నాయక్, నాయకులు తులసి శ్రీనివాస్, భీమిడి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ, కొండోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నవోదయ ఫలితాల్లో యూనివర్సల్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో యూనివర్సల్ కోచింగ్ సెంటర్ 34 మంది విద్యార్థులు తమ సత్తా చాటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో యూనివర్సల్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ బాల్ రాజు విద్యార్థులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనంజయ్, విష్ణు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/కొత్తూరు:** కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ఆధ్వర్యంలో హనుమాన్ కాలనీలో తాగునీటి సమస్యను తీర్చేందుకు శాశ్వత నల్లాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ పెంజర్ల గ్రామంలోని హనుమాన్ కాలనీలో తాగునీటి కోసం ప్రజలు గత మూడేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాను ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి శాశ్వత నీటి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపునివ్వాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్ గౌడ్ కోరారు. గత బిఆర్‌ఎస్ హయాంలో అప్పటి మంత్రి కెటిఆర్‌ను అడ్డుకున్న కేసుల్లో చంద్రపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అందె మోహన్, శివగల సుమన్, సాయి, వంశీ, పప్పిడి మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్‌నాయక్, గాజుల నందు, అంజి యాదవ్, ఫిరోజ్‌ఖాన్, పులిమామిడి రాజేష్ గౌడ్‌లు బుధవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాలీలు, పోరాటాలు, ప్రదర్శనలకు, ఉద్యమాలకు యువజన కాంగ్రెస్ నేతలు అవసర పడుతారే తప్పా పదవులకు సరిపోరా అని ప్రశ్నించారు. పార్టీలు మారిన వ్యక్తులకు పదవులు ఇస్తే రాజీనామ చేస్తామని హెచ్చరించారు.

# గ్యాస్ వినియోగదారుల ధర్నా



**ప్రజాపక్షం/కొందుర్గు:** కొందుర్గు కేంద్రంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరుపై మండిపడుతూ షాద్‌నగర్..పరిగి రోడ్డుపై వినియోగదారులు ధర్నాకు దిగారు. ప్రభుత్వం నుండి గ్యాస్ వస్తున్నా నిర్వాహకులు మాత్రం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ వినియోగదారులకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని మండిపడుతున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే గ్యాస్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం వినియోగదారులకు సరిపడ గ్యాస్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** మహిళా సంఘాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఫరూఖ్‌నగర్ మండల ఎపిఎం జంగయ్య వివరించారు. బుధవారం ఫరూక్‌నగర్ ఎపిఎంగా బాధ్యతలు స్వీకరించిన జంగయ్యను మహిళా సంఘాల సభ్యులు, సిసిలు, విఓఏలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కోశాధికారి సులోచన, సీనియర్ సిసి రామచంద్రయ్య, విఓఏల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి మొయినోద్దీన్, మండల అధ్యక్షుడు శంకర్, సిసిలు, విఓఏలు, అకౌంటెంట్లు, అపరేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో బిసి బిల్లుకు ఉద్యమించండి

బిసి సంఘాలు, పార్టీలకు ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** బిసిల రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా ఉద్యమించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్ని రాజకీయ పార్టీలను, బిసి సంఘాలను కోరారు. ఈ విషయమై తాను ప్రధాని మోదీని కలిసి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. మహిళా బిల్లు పెట్టడం చారిత్రాత్మకమని, ఇది రాజకీయరంగంలో ఒక చరిత్ర సృష్టిస్తుందన్నారు. త్వరలో బిసి బిల్లు పెడతారని కూడా ఆశిస్తున్నట్టు చెప్పారు. మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా రావాలంటే మొదట బిసి బిల్లు రావాలని పేర్కొన్నారు. అప్పుడే దానంతట అదే బిసి మహిళలకు సబ్ కోటా వస్తుందన్నారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసి, రూ.2లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ప్రకటించాలన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25శాతం నుంచి 50శాతం పెంచాలని డిమాండ్ చేశారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిల నియామకాల్లో, ప్రైవేట్ రంగంలో ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నేతలు సి.రాజేందర్, మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద మరణాలను శూన్యానికి తీసుకెళ్లాలి : కలెక్టర్ హరిచందన

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** రోడ్డు ప్రమాద మరణాలను శూన్యానికి తీసుకువెల్లాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ లో బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, జిల్లా రవాణాశాఖ అధికారి పురుషోత్తం రెడ్డి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 'ఎర్లీ బర్డ్' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఎర్లీ బర్డ్' పథకాన్ని ప్రతి ఒక్క ఆస్తి పన్ను చెల్లింపుదారులూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి సూచించారు. ఈ సంవత్సరం ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రూ. 260 కోట్ల రాబడిని లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని వివరించారు. ముందస్తు చెల్లింపుల ద్వారా 5 శాతం రాయితీ పొందవచ్చన్నారు. తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30వ తేదీ మధ్య చెల్లిస్తే, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ అందిస్తున్న 5 శాతం రాయితీని ఎర్లీ బర్డ్ పథకం ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని నివాస,వాణిజ్య ఆస్తులకు కూడా సమానంగా వర్తిస్తుందన్నారు. ఈ ముందస్తు చెల్లింపులు ఎంఎంసి అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ mmc.telangana.gov.in ద్వారా లేదా MyCURE మొబైల్ యాప్‌ను ఉపయోగించి కూడా పన్నులను చెల్లించవచ్చని అన్నారు. గత 15 రోజుల్లో మొత్తం రూ 61.95 కోట్ల ముందస్తు చెల్లింపులు జరిగాయని, తద్వారా పన్ను చెల్లింపు దారులకు రూ. 3.1 కోట్లు రాయితీ వచ్చిందన్నారు. మల్కాజిగిరి నగర్ పాలక పరిధిలోని ఆస్తి పన్ను చెల్లించేవారు తమ చెక్కులపైన కమిషనర్ ఎంఎంసి అని రాస్తేనే చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు.

# 'శేరిలింగంపల్లి' జోన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

సిఎంసి కమిషనర్ శ్రీజన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ (సిఎంసి) డాక్టర్ సి.శ్రీజన తెలిపారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులు,ప్రజా సమస్యల పరిష్కారంపై కమిషనర్ జోనల్ కార్యాలయంలో బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యుబిడి , యుసిడి విభాగాల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీజన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పనులన్నింటినీ '99 రోజుల ప్రోగ్రాం'లో భాగంగా జూన్ 2వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జోన్లలోని అన్ని రోడ్లకు ఎండ్‌టుఎండ్ కార్పెటింగ్ చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా జూన్ 2 లోపు మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈనెల చివరి నాటికి జోన్ అంతటా పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# దైవభక్తితో మనస్సుకు ప్రశాంతత



**ప్రజాపక్షం/కొత్తూరు:** దైవభక్తితోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని రంగారెడ్డి జిల్లా బిసిసేన అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయానికి రూ.65వేల సొంత ఖర్చులతో 8సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదర్ శ్రీనివాస్ యాదవ్‌ను నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఆలయ కమిటి చైర్మెన్ జిల్లెల బాల్‌రెడ్డి, ఆలయ ట్రెజరర్ ఎదిరె శ్రీకాంత్ గౌడ్, కుమార్‌గౌడ్, బి.కృష్ణ యాదవ్, బి.జంగయ్య గౌడ్. వార్డు సభ్యుడు కిట్టుతోపాటు మరికొంత మంది సభ్యులు ప్రత్యేకంగా అభినంధించారు.

# పాలమూరు ప్రాజెక్టులు వదిలేసి..నీళ్లు నల్లగొండకా?

పాలమూరు ప్రాజెక్టుల ఉద్యమ వేదిక చైర్మన్ రాజేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాలమూరు ప్రాజెక్టులను గాలికొదిలేసి.. నల్లగొండకు నీళ్లు తీసుకువెళ్ళడంలో అంతర్యమేమిటో చెప్పాలని పాలమూరు ప్రాజెక్టుల ఉద్యమ వేదిక చైర్మెన్ రాజేందర్‌రెడ్డి, కన్వీనర్ రాఘవులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగు నీరు, తాగునీరు అంధించాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం నాచ్చుడు దోరణి అవలంభిస్తుందే తప్పా పనులు చేపట్టడం లేదని మండిపడ్డారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులను పనులు మొదటి పెట్టి మధ్యలోనే నిలిపివేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సాగుతాయా అంటే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా పాలమూరు జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను సందర్శించి పరిశీలించడం జరిగిందని, లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మించే ప్రాంతాన్ని సైతం పరిశీలించినట్లు తెలిపారు. పాలమూరు..రంగారెడ్డి ప్రాజెక్టు 90శాతం పనులు పూర్తి చేశామని రాజకీయ నాయకులు ప్రకటనలు చేస్తున్నారే తప్పా 10శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. షాద్‌నగర్ ప్రాంత ప్రజలు లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా దక్షణ ప్రాంతంలో ఉన్న లక్ష్మీ దేవిపల్లి రీజర్వాయర్ పూర్తి చేశారని ఆశిస్తే నేటి వరకు తట్టెడు మట్టి తీయలేదని వాపోయారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకులు టిజి శ్రీనివాస్, వి.రామారావు, సుధాకర్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

# నేటి నుంచి మండల స్థాయి సభలు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నేటినుంచి నిర్వహించే మండల స్థాయి సభలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన సంబంధిత అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16న మండల వార్డు సభలు సమర్ధవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ సూచన మేరకు, జిల్లాలో ప్రతి మండలంలో పాఠశాల, మండల కార్యాలయం, బహిరంగ ప్రదేశం, ఏదైనా ఇతర అనువైన వేదికను ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలకు మండల స్థాయి సభలను ప్రారంభించాలన్నారు. మండల స్థాయి సభలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, మంత్రులు, ఎంపి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సభలను రాష్ట్ర గీతంతో ప్రారంభించాలని, అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చదివి వినిపించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై చర్చించాలని, మండల స్థాయి సభలలో తహసీల్దార్, ఎంపిడిఒ, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఉండేలా చూడాలని సూచించారు. మహిళలు వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని, ప్రదర్శన కోసం స్క్రీన్ మరియు ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, వేసవి కాలం అయినందున తాగునీరు, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సభ బ్యానర్ ప్రదర్శించాలని సూచించారు. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి మండల సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ కలెక్టర్ స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సిఇఒ సిహెచ్ కృష్ణ రెడ్డి, సిపిఒ సౌమ్య, డిపిఒ వి.సురేష్ మోహన్, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సజావుగా ధాన్యం సేకరణ ప్రక్రియ



రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ధాన్యం సేకరణ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు, ప్రభుత్వం, సివిల్ సప్లైస్ కమిషనర్ జారీ చేసిన వరి సేకరణ సూచనలను పాటించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, డిఎంసిఎస్, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులందరితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లకు ధాన్యం నిల్వకు స్థలం కల్పించేందుకు, సిఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని తెలిపారు. విసి అండ్ ఎండి సవరించిన ఒప్పందం ప్రకారం, రబీ 2025–26 వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ కార్యకలాపాల కోసం డిస్ట్రిక్ట్ మేనేజర్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా గత సీజన్లలో తిరిగి ఇవ్వాల్సిన, ఉపయోగపడే పాత గోనె సంచులను గరిష్టసంఖ్యలో డిఎంసిఎస్‌సికి ఎలాంటి ఆలస్యం లేకుండా తిరిగి ఇవ్వాలని స్పష్టం చేశారు. వరి సేకరణ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు, సివిల్ సప్లైస్ కమిషనర్ జారీ చేసిన వరి సేకరణ సూచనలను పాటించాలని తెలిపారు.

# బిఆర్‌ఎస్ నాయకులు కర్నె అరవింద్‌కు మాజీ మంత్రుల నివాళి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్‌ఎస్ నాయకులు కర్నె అరవింద్ ఇటీవల అకాల మరణం పొందారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని కర్నె అరవింద్ స్వగృహానికి బిఆర్‌ఎస్ శాసన సభ పక్ష ఉపనాయకుడు తన్నీరు హరిష్‌రావు, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వెళ్లి కర్నె అరవింద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం కుంటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు శంభీపురి రాజు, క్యామ మల్లేష్, ప్రశాంత్‌కుమార్ రెడ్డి, సత్తు వెంకటరమణా రెడ్డి, టెకుల సుదర్శన్ రెడ్డి, సిఎచ్ బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.

# సాధ్యమైనంత మేరకు మధ్యాహ్నం వేళ బయటికెళ్లొద్దు

రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిడాక్టర్ కె.లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎండల తీవ్రత అత్యంత వేగంగా పెరుగుతున్నందున సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లొద్దని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డిఎంహెచ్‌ఒ)డాక్టర్ కె.లలితాదేవి సూచించారు. గతం కంటే మించి ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు పలు సూచనలు, సలహాలతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయని, ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడుతున్నాయని, వీటి ధాటికి డీ హైడ్రేషన్‌కు లోనయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. గంటల తరబడి ద్విచక్రవాహనాలపై ప్రయాణించే మార్కెటింగ్ ఏజెంట్లు, చిరు వ్యాపారులు, ఉపాధి హామీ కూలీలు, యాచకులు, వీధి వ్యాపారులు, వృద్ధులు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందన్నారు. ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల డీహైడ్రేషన్‌కు లోనవుతుంటారని తెలిపారు. డీహైడ్రేషన్‌తో అధిక జ్వరం, తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటి సమస్యల బారిన పడతారన్నారు. తీవ్రమైన అలసటతో పాటు శరీరం ఎర్రబారటం, పొడిగా మారడం జరుగుతుందన్నారు. స్పృహ కోల్పోవడం, వేగంగా గుండెకొట్టుకోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం బయటికి వెళ్లకపోవడమే ఉత్తమం. అనివార్యమైతే వెంట గొడుగు, వాటర్ బాటిల్, తలకు క్యాప్, కళ్లకు సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి. ఉక్కపోత నుంచి ఉప శమనం కోసం వదులైన లేత రంగు కాటన్ దుస్తులను ధరించాలి. కఠినమైన శారీరక శ్రమ చేయకూడదు. మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉండాలి. మసాల ఆహారానికి బదులుగా తేలికగా జీర్ణం అయ్యే ఆహారం తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్‌కు బదులుగా మజ్జిగ, చెరుకు రసం, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి. వాటర్‌మిలాన్, కర్బూజా, మోసంబి, నిమ్మ పండ్ల రసాలు తీసుకోవాలి. స్పృహతప్పి పడిపోయిన బాధితులను వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, చన్నీటితో శరీరాన్ని శుభ్రం చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో 108లో సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.

